
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

గురువారం 24 అక్టోబరు 2024

సమగ్ర సర్వేకు సిద్ధం

- జిల్లాలో 1300 వరకు బ్లాక్‌ల ఏర్పాటు
- 34 రెయిన్ గేజ్‌లు
- కార్యాలయంలో సిబ్బంది కొరత
- పీబీ శ్రీనివాసాచారి, సీపీవో

ఇంటర్వ్యూ



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ప్రభుత్వం చేపట్టనున్న కుల గణన సమగ్ర సర్వేకు తాము సిద్ధంగా ఉన్నామని, ఇందుకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా ప్రణాళిక శాఖ అధికారి పీబీ శ్రీనివాసాచారి తెలిపారు. ప్రణాళిక శాఖ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలను బుధవారం ఆంధ్రజ్యోతితో వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: సమగ్ర సర్వే ఎప్పుడు మొదలవుతుంది?

సీపీవో : సామాజిక విద్యా ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ, కులగణన సర్వే సంబంధించి డోర్‌టు డోర్ సర్వేకు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. సుమారుగా 150 కుటుంబాలను ఒక బ్లాక్‌గా విభజించి సర్వే చేపట్టనున్నాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఎన్ని బ్లాక్‌లు ఉండబోతున్నాయి?

సీపీవో : సమగ్ర సర్వేలో దాదాపుగా 1300 వరకు బ్లాక్‌లు ఏర్పాటు అవుతాయి. ప్రతీ బ్లాక్‌కు ఒక ఎనిమిరేటర్ ఉంటారు. సర్వేకు సంబంధించి గ్రామీణ, మండలస్థాయి వరకు వివిధ శాఖల ఉద్యోగుల వివరాలు సేకరించి ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వం ఆదేశిస్తే సర్వే చేయడానికి సిద్ధం ఉన్నాం.

ఆంధ్రజ్యోతి: ఎన్ని ప్రశ్నలతో సర్వే చేపట్టనున్నారు?

సీపీవో : ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ప్రశ్నావళి రాలేదు. విధి, విధానాలు, ప్రశ్నపత్రాలు వచ్చిన వెంటనే ప్రారంభిస్తాం.

ఆంధ్రజ్యోతి: కమతాల సర్వే జరిగిందా?

సీపీవో : జిల్లాలో మొదటి విడత కమతాల సర్వే పూర్తి చేశాం. మొదటి విడతలో 1,32,574 రైతులకు సంబంధించిన కమతాలతో 2,71,773 ఎకరాలు సర్వే చేశాం. రెండో విడత సర్వే చేపట్టనున్నాం. 20 శాతం రెవెన్యూ గ్రామాల్లో కమతాల సర్వే చేస్తాం.

మిగతా 8వ పేజీలో...

న్యూస్ బాక్స్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆధ్వర్యంలో నాయకులు బుధవారం అందజేశారు. మండలంలోని 12 మంది లబ్ధిదారులకు రూ.6.75లక్షల చెక్కులు మంజూరయ్యాయన్నారు. నాయకులు గౌస్, మహేందర్, రాజు, పర్శరాములు, మల్లారెడ్డి, మోదీన్ పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జి బాధ్యతల స్వీకరణ


సిరిసిల్ల క్రైం, అక్టోబరు 23: సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జిగా పి. లక్ష్మణమూర్తి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్జిని మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్షుడు డోర్నాల సంజీవరెడ్డి, కార్యదర్శి వెంకటి, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ఇల్లంతకుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుద్ధ జల ప్లాంటును బుధవారం ప్రారంభించారు. అమ్మఆదర్శ పాఠశాల కింద వచ్చిన నిధులతో వాటర్ ప్లాంటును ప్రారంభించినట్లు ప్రధానోపాధ్యాయిని రేవతిదేవి తెలిపారు.

అభయహస్తం లబ్ధిదారుల్లో నిరాశ

- జిల్లాలో 60,881 మంది
- వాటాధనం రూ.4.82 కోట్లు
- రూ.8 కోట్లపైగా పింఛన్ బకాయిలు
- ఉద్యమానికి ప్రజా సంఘాల కార్యాచరణ



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి తాజా కాంగ్రెస్ ప్రభుత్వం వరకు అభయహస్తం లబ్ధిదారులకు నిరాశ ఎదురవుతోంది. అభయహస్తం లబ్ధిదారుల ఆందోళనల నేపథ్యంలో గత ప్రభుత్వం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ప్, మెప్మా, అధికారులు సిబ్బందితో అభయ హస్తం సభ్యులకు సంబంధించిన వివరాలను సేకరించింది. అధికారులు బ్యాంక్ ఖాతాల వివరాలు సేకరించి ప్రభుత్వానికి పంపించారు. ఎన్నికలు రావడంతో వస్తాయనుకున్న డబ్బులు నిరాశ పర్చాయి. ప్రభుత్వం మారిపోయింది. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి లబ్ధిదారులు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేకుండా పోతోంది. కొత్త ప్రభుత్వం అభయహస్తం లబ్ధిదారులకు చేయూతను ఇస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. పది నెలలు గడిచినా నిర్ణయం రాకపోవడంతో జిల్లాలో అభయ హస్తం లబ్ధిదారుల తరఫున ప్రజా సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. మహిళా పొదుపు సంఘాల్లో ఉన్న సభ్యులకు చేయూతను ఇచ్చే దిశగా 2009లో అప్పటి ప్రభుత్వం



ఎల్ఐసీ అనుసంధానంతో అభయహస్తం పథకాన్ని అందించింది. పథకంలో చేరిన మహిళలకు ఎంతో ఉపయోగకరంగా కనిపించింది.ఆ తరువాత స్వరాష్ట్రం లోనే ప్రభుత్వం పథకాన్ని నిలిపివేసింది. కనీసం ప్రీమియం చెల్లించిన లబ్ధిదారులకు డబ్బులు తిరిగి ఇవ్వడంలోనూ నిర్లక్ష్యమే చూపింది. పథకం లేకపోయి నా జిల్లాలోని లబ్ధిదారులకు కోట్ల రూపా యల బకా యిలు రావాల్సి ఉంది. అభయ హస్తంపై 2022 మార్చిలో లబ్ధిదారులు హైకోర్టును ఆశ్రయిం చారు. హైకోర్టు అభయ హస్తం వివరాలు ఇవ్వాలని కోర డంతో లబ్ధిదారుల సేకరించిన సెర్ప్ ప్రభుత్వానికి పంపించింది. అభయ హస్తం డబ్బులు వస్తాయని భావించినా దాదాపు రేండేళ్లు గడుస్తున్నాయి. ఇంత వరకు లబ్ధిదారులకు ప్రీమియం డబ్బులుగానీ, బకాయిలుగానీ అందించలేదు.

నిలిచిన పింఛన్

ఎనిమిదేళ్లుగా అభయహస్తం ద్వారా అందాల్సిన పింఛన్, బీమా, ఉపకారవేతనాలు నిలిచిపోయాయి. ఒక వ్యక్తికి ఒకే పింఛన్ నిబంధనతో అభయ హస్తం లబ్ధిదారులు ఆసరా పింఛన్లు పొంద లేకపోయారు. 2017లో అభయ హస్తంలో మార్పులు తీసుకొచ్చి కొత్త పథకాన్ని అందిస్తామని ప్రభుత్వం చెప్పినా ఇప్పటి వరకు అమల్లోకి రాలేదు. వాటాధనం తిరిగి చెల్లిస్తామని చెప్పినా మళ్లీ పట్టించుకునే వారు కరువయ్యారు. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అభయ హస్తం పథకానికి మంచి స్పందన లభించడమే కాకుండా తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు పింఛన్లు కూడా వచ్చాయి. మిగతా 8వ పేజీలో...

ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం

- మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ
- కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

8

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

- మాదిగ, మాదిగ ఉపకులాల ఐక్య వేదిక కన్వీనర్ కత్తెర దేవదాస్



సభలో మాట్లాడుతున్న కన్వీనర్ కత్తెర దేవదాస్

8

మంగళపల్లి రోడ్డుకు మహర్దశ

- రూ. కోటి 30 లక్షలు మంజూరు

కోనరావుపేట, అక్టోబర్ 23 : (ఆంధ్రజ్యోతి) మంగళపల్లె గ్రామస్థులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తారు రోడ్డు నిర్మాణానికి మహర్దశ పట్టింది. గుంతలమయంగా మారిన రహదారికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు స్థానిక నాయకులు, గ్రామస్థులు విన్నవించారు. తారు రోడ్డు నిర్మాణానికి కోటి 30 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. దీంతో గ్రామస్థులు ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కోనరావుపేట మండలం సుద్దాల ఎక్స్ రోడ్డు నుంచి మంగళపల్లి వరకు రోడ్డు వేయనుండడంతో వాహనదారుల కష్టాలు తీరనున్నాయి.

ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం

వేములవాడ రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అకాలవర్షానికి తడిసిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకుల భరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం అన్నారు. పట్టెంలలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల మోసపూరిత మాటలు నమ్మి ఆగం కావద్దన్నారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు ధాన్యాన్ని పరిశీలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గుడిసె శంకర్, నాయకులు పొన్నం సత్యం, షోషల్ మీడియా గుడిసె రాజేంద్ర ప్రసాద్, ఎమిరెడ్డి నరసింహారెడ్డి, తిరుపతిరెడ్డి, లింగ రెడ్డి, కొట్టే గంగసాగర్, భుం రెడ్డి, రంగు అనిల్ పాల్గొన్నారు.

గిర్రవేని కుంటకు గండి

కోనరావుపేట, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలంలోని ధర్మారం లో గిర్రవేనికుంట మత్తడి దగ్గరలో గండి పడడంతో నీరంతా వృథాగా పోతోంది. కుంట కింద సుమారు 100 ఎకరాల ఆయకట్టు సాగుచేస్తున్నారు. నీరు వృథాగా పోతుండడంతో అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ కుంట కింద రెండు గ్రామాలకు చెందిన రైతుల భూములున్నాయని నీరు అంతా దిగువకు పోయాక తాము ఎలా బతికేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, కుంటకు మరమ్మతు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నిత్యాన్నదాన సత్రానికి రూ.లక్ష విరాళం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ నిత్యాన్నదాన సత్రానికి భక్తుడు బుధవారం రూ.లక్ష విరాళం అందజేశారు. ముంబాయి పట్టణానికి చెందిన డాక్టర్ రామ్‌చంద్ర పద్మావార్ దంపతులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు ఆగంరావు, గౌతమ్‌కు చెక్కు అందజేశారు.

బోరుబావికి మరమ్మతు

చందుర్తి, (రుద్రంగి) అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిరుపయోగంగా ఉన్న బోరుబావికి బుధవారం మరమ్మతు పనులు చేపట్టి మోటారు బిగించారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కళాశాలను సందర్శించగా అధ్యాపకులు, విద్యార్థులు పలు సమస్యలపై విన్నవించారు.దీంతో బోరుబావికి మరమ్మతు చేయించారు.

రసాభాసగా సింగిల్ విండో ప్రత్యేక సమావేశం

చందుర్తి, అక్టోబర్ 23, (ఆంధ్రజ్యోతి): చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బుధవారం ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల ప్రారంభంపై నిర్వహించిన ప్రత్యేక సమావేశం రసాభాసగా మారింది. చైర్మన్ తిప్పని శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా పలువురు డైరెక్టర్లు మాట్లాడుతూ గత యాసంగి ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. వివరాలు వెల్లడించిన తర్వాతే కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మిల్లర్ల నుంచి అలాట్మెంట్ రాకముందే కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తే ఎదురయ్యే ఇబ్బందులపై డైరెక్టర్లు సీఈవోకు వివరించారు. చైర్మన్ తిప్పని శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల సమయంలో ఎన్నికల కోడ్ ఉండడంతో తాను కొనుగోలు కేంద్రాల నిర్వహణ చూడలేదని, అప్పుడు సీఈవో ఆధ్వర్యంలోనే కొనుగోళ్లు చేపట్టారని తెలిపారు.

క్షయవ్యాధి రహిత జిల్లాగా మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

ఇల్లంతకుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : క్షయవ్యాధి రహిత జిల్లాగా మార్చలన్నదే ప్రభుత్వ లక్ష్యమని టీబీ అలర్ట్ ఇండియా ప్రోగ్రాం జిల్లా అధికారి దండుబోయిన శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కందికట్కూర్, వల్లంపట్ల, రహీంఖాన్‌పేట గ్రామాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ కేసులు ప్రపంచంలోనే అత్యధికంగా భారతదేశంలో నమోదవుతున్నాయన్నారు. టీబీ ద్వారా మరణాల సంఖ్య పెరుగుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఐదు జిల్లాలను ఎంపిక చేసి క్షయవ్యాధిని నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకుందని, అందులో రాజన్న సిరిసిల్ల జిల్లా ఒకటని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శరణ్య తదితరులు పాల్గొన్నారు.

రూ. 14 లక్షలతో కల్వర్టు నిర్మాణం

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) 23 : మున్సిపల్ జనరల్ ఫండ్స్ నుంచి రూ.14లక్షలతో 5వ వార్డులోని మురికి కాలవపై కల్వర్టు నిర్మాణం చేపడుతున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం 5వ వార్డులో కల్వర్టు నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్, సుభాష్‌నగర్, గాంధీనగర్, అంబేద్కర్‌నగర్, శాంతినగర్ మీదుగా ప్రవేహించే ప్రధాన మురికి కాలువ 5వ వార్డులో ఉండే కల్వర్టు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందన్నారు. కౌన్సిలర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకరావడంతో సమావేశంలో సభ్యుల ఆమోదంతో కల్వర్ట నిర్మాణం పనులను చేపడుతున్నట్లు చెప్పారు. కౌన్సిలర్ దార్నం అరుణాలక్ష్మినారాయణ, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మి నారాయణ, మున్సిపల్ డీఈ వాణి పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి నిధులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి నాబార్డు ద్వారా అధిక నిధులు కేటాయిస్తోందని నాబార్డు ఏజీఎం అభిషేక్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, కేడీసీసీ బ్యాంకును ఆయా శాఖల అధికారులతో కలిసి బుధవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఏజీఎం అప్సాద్, బోస్టన్ గ్రూప్ ఇండియా ప్రతినిధి ఆర్యన్, కేడీసీసీ బ్యాంక్ సీఈవో సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ రుణాల మంజూరు పూర్తి చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అహార శుద్ధి యూనిట్ల ఏర్పాటుకు ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద మంజూరైన పెండింగ్ రుణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం పీఎంఎఫ్‌ఎంపై సంబంధిత అధికారులు, బ్యాంకర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పీఎంఎఫ్ఎం దరఖాస్తుల స్థితిగతులకు సంబంధించిన నివేదికను, దరఖాస్తుల స్క్రూటినీ, రుణాల మంజూరు, యూనిట్ ఏర్పాటు ప్రక్రియను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో పీఎంఎఫ్ఎంకు సంబంధించి 272 యూనిట్ల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేయగా 214 యూనిట్ల రుణాల పంపిణీ పూర్తి చేశామన్నారు. 170 యూనిట్ల గ్రౌండింగ్ చేశామని, 119 యూనిట్లకు సబ్సిడీ వచ్చిందని తెలిపారు. 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల దగ్గర పెండింగ్‌లో ఉన్న 73 పీఎంఎఫ్ఎం దరఖాస్తులను పరిశీలించి త్వరగా అర్హత ప్రకారం రుణాల మంజూరు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో మరో 16 అహార శుద్ధి యూనిట్లు అందులో ఫ్లోర్‌మిల్, ఆయిల్ మిల్, పసుపు కారం, తయారీ యూనిట్లు మొదలగు ఏర్పాటుకు మంజూరు చేసిన రుణాలను పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో శేషాద్రి, ఎల్‌డీఎం మల్లిఖార్జున్‌రావు, ఇంచార్జ్ జీఎం భారతి, స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్ దివ్యశ్రీ, డీఆర్‌పీ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

నాబార్డు ప్రతినిధుల బృందం పర్యటన

గంభీరావుపేట, అక్టోబరు 23 : గంభీరావుపేట మండలంలో కేంద్ర నాబార్డు ప్రతినిధుల బృందం బుధవారం పర్యటించింది. మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయాన్ని సభ్యులు సందర్శించారు. దేశ వ్యాప్తంగా ఉత్తమ సేవలు అందిస్తూ లాభాల బాటలో కొనసాగుతున్న సహకార సంఘాల సందర్శనలో భాగంగా ఈ నాబార్డు ప్రతినిధులు బృందం పర్యటించింది. అభివృద్ధిలో మందంజలో ఉన్న సహకార సంఘాల దీర్ఘకాలిక ప్రణాళికలు, వాటి సేవలు, సక్సెస్ స్టోరీస్‌పై స్టడీ చేసే అంశంపై చర్చించారు. నష్టాల్లో ఉన్న సంఘాలను లాభాల బాటలోకి తేవడం, దేశంలో ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్న సంఘాలను స్ఫూర్తిగా తీసుకోవడం వంటివాటిపై వివరించారు. నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, ముంబాయి నాబార్డు ఏజీఎం అభిషేక్, హైదరాబాద్ నాబార్డు ఏజీఎం అప్సాద్, బోస్టన్ గ్రూప్ ఇండియా ప్రతినిధి ఆర్యన్, జిల్లా కేంద్ర బ్యాంక్ సీఈవో సత్యనారాయణ, ప్యాక్స్ డెవలప్‌మెంట్ సెల్ మేనేజర్ సత్యనారాయణ, కేడీసీసీబీ జనరల్ మేనేజర్స్ శ్రీధర్, రియాజ్, డీడీఎం జయప్రకాష్ పాల్గొన్నారు.



కేంద్ర నాబార్డు ప్రతినిధుల బృందం

వైద్యుల ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు

సిరిసిల్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రభుత్వ జనరల్ అసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయడానికి బుధవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధ్యక్షతన ఇంటర్వ్యూలు నిర్వహించారు. అసుపత్రిలో బ్లడ్ బ్యాంక్, ఎమర్జెనీ వార్డులో నాలుగు పోస్టులు ఖాళీలు ఏర్పడగా సివిల్ అసిస్టెంట్ అర్హతగా నిర్ణయించారు. డాక్టర్‌ల నుంచి దరఖాస్తులు అహ్వానించారు. తొమ్మిదిమంది హాజరవగా ముగ్గురిని ఎంపిక చేశారు. ఇంటర్వ్యూల్లో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీనారాయణ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కలెక్టర్, అధికారులు

అనుమతుల పేరిట ఇసుక అక్రమ రవాణా

- బోయినపల్లిలో జోరుగా దందా
- అధికారుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం

బోయినపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అనుమతుల పేరిట ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మంగళవారం పోలీస్‌లు ట్రాక్టర్లు పట్టుకొని అనుమతి పత్రాలను పరిశీ లించగా పలు అంశాలు వెలుగు చూశాయి. మండలంలో ప్రజలు, ప్రభుత్వ పనులకు మిడ్ మానేరు జలాశయం మాను వాడ సమీపాన మానేరు వాగులో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇస్తున్నారు. మిడ్ మానేరు ప్రాజెక్టు కింద ఇసుక తవ్వకాలు చేపట్టరాదని ప్రాజెక్టు అధికారులు రెవెన్యూ అధికారులకు నివేదికల సైతం అందజేశారు. రెవెన్యూ అధి కారులు అవేమీ పట్టించుకోకుండా అనుమతులు జారీ చేస్తున్నారు.

ఒకే గ్రామం ట్రాక్టర్లకు అనుమతులు

మండలంలో 23 గ్రామాలు ఉండగా ప్రజల అవసరాల కోసం ప్రభుత్వానికి బ్యాంకు ద్వారా డబ్బులు చెల్లించి వారికి అనుకూ లమైన ట్రాక్టర్ యజమానుల వాహనాల రిజిస్ట్రేషన్ పేపర్లతో తహసీల్దార్ కార్యాలయంలో అనుమతి పత్రాలు



పోలీస్ స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్‌లు

పొందాలి. కేవలం మానవాడ గ్రామానికి చెందిన 30 ట్రాక్టర్లకు మాత్రమే మండలంలో ఇసుక రవాణా చేసే సదుపాయాన్ని అధికారులు కల్పించారు.

చెప్పిన రేటు చెల్లించాల్సిందే

ఒక్కో ట్రాక్టర్ ఇసుకకు ప్రభుత్వానికి 300 రూపాయల డీడీని ఇసుక అవసరం ఉన్నవారు చెల్లించాలి. ఇసుక కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారి గ్రామాల ట్రాక్టర్లకు అధికారులు అనుమతులు జారీ చేయడం లేదు. కేవలం మానవాడకు చెందిన ట్రాక్టర్లకు మాత్రమే ఇసుక రవాణాకు అనుమతులు జారీ చేస్తుండడంతోపాటు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. మానువాడ గ్రామ ట్రాక్టర్ యజమానులు కూడా వారి యూనియన్‌లో లేకపోతే ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వడం లేదు.

ముందస్తు అనుమతులు

ఇసుక రవాణాకు ఏ రోజుకు ఆ రోజే అనుమతి పత్రాలు తేదీ లతో సహా జారీ చేయాల్సి ఉండగా ముందస్తుగా తేదీలు లేకుండానే అనుమతి పత్రాలు జారీ చేయడంతో ఇసుక ట్రాక్టర్ యజమా నులకు వరంగా మారింది. మంగళవారం పట్టుబడిన ట్రాక్టర్ల వే బిల్లులను పోలీసులు పరిశీలించగా అచ్చు కాగితంపై తేదీలు మార్చినట్లు నిర్ధారణ అయ్యింది. వెంటనే ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇసుక అక్రమ రవాణాపై విచారణ చేపట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ ఫిర్యాదు చేశారు.

క్రైం కార్నర్

ఆస్తి తగదాలతో అన్నను చంపిన తమ్ముళ్లు

- ముగ్గురు నిందితుల అరెస్ట్



మాట్లాడుతున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వరరావు

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గతంలో ఉన్న ఆస్తి తగదాలను మనుసులో పెట్టుకుని సొంత అన్న అని చూడకుండా హత్య చేశారు ఇద్దరు తమ్ముళ్లు. మల్లాపూర్ మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో ఈ నెల 20న పల్లపు సాయిలు(36)ను హత్య చేసిన ముగ్గురు నిందితులను బుధవారం పోలీస్‌లు అరెస్ట్ చేశారు. అరెస్ట్‌కు సంబంధించిన వివరాలను మెట్‌పల్లి డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఉమామహేశ్వరరావు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుని తమ్ముళ్లు పల్లపు చందు, పల్లపు చిన్నితో పాటు గొల్ల సోయమ్మ అనే వారితో పల్లపు సాయిలుకు గత కొద్ది రోజులుగా భూ వివాదంతో పాటు ఇంటి స్థలం విషయంలో కొన్ని సంవత్సరాలుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ వ్యవహారంలో గతంలో మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయతీలు కూడా జరిగాయి. ఈ క్రమంలో వ్యవహా రం ఎటు తెగకపోవడంతో కక్ష పెట్టుకున్న తమ్ముళ్లు మృతుడు పల్లపు సాయిలును ఎలాగైనా హత్య చేయాలని పథకం వేసారు. దీంతో పల్లపు సాయిలు ఒంటరిగా ఉన్న సమయాన్ని చూసి గొల్ల సోమయ్య, చందు, చిన్ని స్థానిక గోదావరి బ్రిడ్జి వద్దకు ద్విచక్ర వాహనంపై చేరుకున్నారు. ఆనంతరం గొడవపడి సాయిలును నెట్టివేయగా కిందపడిపోయాడు. వారి వెంట తెచ్చుకున్న తల్వార్‌తో మెడపై బలంగా నరికి హత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఆనంతరం ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. మృతుని భార్య నవ్య ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం మల్లాపూర్ శివారులోని కనకసోమేశ్వర గుడి వద్ద ఉన్నారనే సమాచారంతో నిందితులను అదుపులోకి తీసుకోని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుండి మూడు సెల్‌ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలు, హత్యకు ఉపయోగించిన తల్వారును స్వాధీనం చేసుకుని ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐలు చిరంజీవి, కిరణ్‌కుమార్, రాజులు పాల్గొన్నారు.

లిఫ్ట్‌లో ఇరుక్కుని ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఒక హోటల్‌లో పనిచేస్తున్న ఒరిస్సాకు చెందిన వెయిటర్ బనమాలి మాతాన్(54) లిఫ్ట్‌లో ఇరుక్కుని మృతి చెందాడని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. ముకరంపుర ప్రాంతానికి చెందిన ఒక హోటల్‌లో వెయిటర్‌గా పని చేస్తున్న మాతాన్ తాను నివాసం ఉంటున్న భవనంలో మొదటి అంతస్తు నుంచి పెంట్‌హౌస్‌కు వెళ్లే క్రమంలో లిఫ్ట్ హఠాత్తుగా కిందికి వెళ్ళడంతో అందులో ఇరుక్కున్నాడు. తీవ్రంగా గాయపడిన మాతాన్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. లిఫ్ట్ సరైన నిర్వహణ లేకపోవడంతో ప్రమాదం జరిగినట్లు మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో ఇంటి యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డుపై వేసిన బోరు సీజ్

జమ్మికుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణ పరిధిలోని పద్మశాలివీధికి చెందిన మహేందర్ అనే వ్యక్తి నడిరోడ్డుపై వేసిన బోరు వేయడంతో, సమాచారం అందుకున్న మున్సిపల్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రోడ్లపైన బోర్లు వేస్తే చర్యలు తప్పవన్నారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన సహించేది లేదని హెచ్చరించారు. రోడ్డుపై బోరు వేసిన వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిపిఓ శ్రీధర్, ఏఈ నరేష్, టిపిఎస్ ప్రదీప్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సదానందం, సిబ్బంది పాల్గొన్నారు.

పరస్పర ఫిర్యాదులపై కేసు నమోదు

జమ్మికుంట రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణానికి చెందిన రాజేష్ అనే వ్యక్తి తనపై అత్యాచారం చేశాడని బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతడనిపై బుధవారం పోలీస్‌లు కేసు నమోదు చేశారు. అదేవిధంగా ఫేస్‌బుక్‌లో తనకు పరిచయం అయిన సదరు మహిళ తనను ఉద్దేశ్యపూర్వకంగా డబ్బులు డిమాండ్ చేసిందని, ఇవ్వకుంటనే అత్యాచారం కేసు పెడుతానని బెదిరించిందని రాజేష్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. పరస్పర ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేశామని పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఒకరికి గాయాలు

శంకరపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం చింతలపల్లి గ్రామ శివారులో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఒకరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చింతలపల్లి గ్రామానికి చెందిన బొంతల మల్లయ్య తన వ్యవసాయ పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా, లింగాపూర్-చింతలపల్లి గ్రామాల మధ్య గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మల్లయ్య కాలు విరిగింది. గమనించిన స్థానికులు 108 వాహనంకు సమాచారం అందించడంతో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆత్మహత్యకు కారణమైన ఒకరి రిమాండ్

శంకరపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు కారణమైన సైదాపూర్ మండలంలోని సోమారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని కేశవపట్నం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. సైదాపూర్ మండలం సోమారం గ్రామానికి చెందిన సుంకరి చందర్ తండ్రి సారయ్యకు చెందిన వ్యవసాయ భూమిలో ఒక ఎకరం భూమిని అవసర నిమిత్తం అదే గ్రామానికి చెందిన పేరుమడ్ల రాజబాబుకు అమ్మాడు. రాజబాబు అక్రమంగా ఎకరం భూమికి బదులు మూడెకరాల భూమిని పట్టా చేయించుకున్నాడు. ఈ విషయం చందర్ తండ్రి సారయ్యకు తెలిసి వీరి మధ్య పలుమార్లు పంచాయతీ జరిగింది. అప్పటికి కూడా భూమిని తిరిగి తన తండ్రి సారయ్య పేరు మీద రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో తన తండ్రి తీవ్ర మనస్తాపం చెంది కేశవపట్నం పొలిమెరలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గతంలో సుంకరి చందర్ కేశవపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా విచారణ జరిపి పేరుమడ్ల రాజబాబును రిమాండ్‌కు తరలించినట్లు కేశవపట్నం ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

పేదరికంతో బిడ్డను విక్రయించిన తల్లిదండ్రులు

- తిరిగి ఇప్పించాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

వేములవాడ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదరికం ఆ తల్లిదండ్రులు బిడ్డను అమ్ముకునేలా చేసింది. తొలుత విక్రయించినా తిరిగి తమ బిడ్డను తమకు ఇప్పించాలని పోలీసులను ఆశ్రయించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో బుధవారం చోటు చేసుకున్న సంఘటన వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన శ్యామల, రవీందర్ దంపతులు 15 సంవత్సరాలుగా రాజన్న ఆలయ పరిసరాల్లో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నారు. దంపతులకు ఐదుగురు ఆడ పిల్లలు సంతానం. పేదరికంతో పిల్లలను పోషించలేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చిన్న పాపను విక్రయించాలని నిర్ణయించుకున్నారు. తమకు పరిచయమున్న జగిత్యాల జిల్లా గోవిందులపల్లి గ్రామానికి చెందిన లక్ష్మికి తమ పాపను అమ్ముతామని ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో మంగళవారం తల్లిదండ్రులు ఇద్దరు లక్ష్మికి పాపను విక్రయించి కాగితం రాసుకున్నారు. బుధవారం శ్యామల తమ పాపను తిరిగి ఇప్పించాలని వేములవాడ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు లక్ష్మిని విచారించగా రూ.90 వేలకు పాపను తనకు విక్రయించారని తెలిపింది. అనంతరం పాపను పోలీసులు శ్యామలకు అప్పగించారు.

సామాజిక వేణుగోపాల్

- ప్రకృతి... జంతువుల ప్రేమికుడు...
- రోడ్డుపై గుంతలు ఏర్పడితే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు
- ప్లాస్టిక్ అనర్థాలపై సైకిల్‌పై తిరుగుతూ ప్రచారం
- హుజూరాబాద్‌లో 'నలుబాల'కు ప్రత్యేక గుర్తింపు

రోడ్డుపై గుంతలు పడ్డాయా.. నలుబాల వేణుగోపాల్ అక్కడికి వస్తాడు. ఎర్ర జెండా ఏర్పాటు చేసి వాహనదారులను దారి మళ్లిస్తాడు.. ఏవైనా జంతువులు చనిపోయాయా.. వేణుగోపాల్ అక్కడికి వచ్చి వాటి కళేబరాలను అక్కడి నుంచి పట్టణానికి దూరంగా తీసుకెళ్లి పూడ్చిపెడతాడు.. ఇలా 25 ఏళ్లుగా హుజూరాబాద్‌లో సామాజిక కార్యక్రమాలకు చిరునామాగా మారారు నలుబాల వేణుగోపాల్. వృతి రీత్యా ఆర్కిటెక్ట్ అయిన వేణుగోపాల్ సామాజిక రుగ్మతలపై యుద్ధం చేస్తున్నాడు. ఆయన వాహనంపై 108 అని రాసుకున్నాడు. ఇలా ఎందుకు అని అడిగితే ఎవరికి ఏ అవసరం వచ్చినా తాను 108లా అక్కడి వచ్చి సహాయం చేస్తానని చెబుతాడు.

ఆదర్శం



ప్లాస్టిక్ సంచులు వాడవద్దంటూ సైకిల్‌పై తిరుగుతూ అవగాహన కల్పిస్తున్న వేణుగోపాల్

హుజూరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆయన ప్రకృతి.. జంతువుల ప్రేమికుడు... రోడ్లపై గుంతలు పడితే సమస్య పరిష్కరించేంత వరకు హెచ్చరిక బోర్డుల ఏర్పాటుతో పాటు అధికారులను పిలిపించి మరమ్మతులు చేయిస్తాడు. ప్లాస్టిక్ సంచులు వాడవద్దని కూరగాయాల మార్కెట్‌కు వెళ్లి అవగాహన కల్పించడంతో పాటు బట్ట సంచులను ఉచితంగా అందజేస్తాడు. సామాజిక కార్యక్రమాలు చేస్తూ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు హుజూరాబాద్‌కు చెందిన నలుబాల వేణుగోపాల్. హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఆర్కిటెక్ట్ వేణుగోపాల్ వృతిరీత్యా భవనాలకు ప్లానింగ్ చేస్తూ సివిల్ ఇంజినీర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. సామాజిక రుగ్మతలను నిర్మూలిస్తూ ఒక సైన్యంలా పనిచేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. రోడ్డు పక్కన కోతులు, కుక్కలు, పందులు చనిపోయి ఉంటే వాటిన తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి అంత్యక్రియలు చేయడం ఆయనకు అలవాటు. కోతులు, కుక్కలతో స్నేహం పెంచుకొని వాటికి ఆహారాన్ని అందిస్తారు. ఎవరైనా అనాథలుగా చనిపోతే వారి మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తాడు. రోడ్లపై గుంతలు పడితే అక్కడ ఎర్ర జెండాతో వాలిపోయి వాహనదారులను దారి మళ్లిస్తాడు. ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని కూరగాయల మార్కెట్‌కు వెళ్లి బట్ట సంచులను ఉచితంగా అందజేస్తాడు. పర్యావరణాన్ని కాపాడాలంటే మొక్కలు నాటాలని సైకిల్‌పై తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు మొక్కలు నాటుతారు. రోడ్లపై చెత్త ఉంటే స్వచ్ఛభారత్‌లో భాగంగా శుభ్రం చేస్తాడు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రచారం చేస్తాడు. ప్రభుత్వాధికారుల పనితీరును, సంక్షేమ పథకాలల్లో అవినీతి అక్రమాలను ప్రశ్నించడం ఈయన నైజం. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు వేణుగోపాల్ కలెక్టర్ల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. పలు అవార్డులు అందుకున్నారు.



హుజూరాబాద్‌లో మొక్కలు నాటుతున్న నలుబాల వేణుగోపాల్

ఆయన ఒక 108...

వేణుగోపాల్ ద్విచక్ర వాహనానికి 108 అని రాసి ఉంటుంది. ఆయనకు ఎవరైనా ఫోన్ చేసి ఇక్కడ ఒక సమస్య ఉందంటే వెంటనే వాలిపోతారు. షోవోలిన్, కుంగ్‌ఫూ, కరాటేలో జాతీయ స్థాయి గుర్తింపు సాధించిన ఆయన 25ఏళ్లుగా సామాజిక కార్యక్రమాల్లో పాలుపంచు కుంటున్నారు. హుజూరాబాద్ పట్టణంలో పారిశుధ్యం అమలు కాకుంటే ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తుంటాడు. ఆస్పత్రుల్లో పేద రోగులకు ఉచితం గా మందులు పంపిణీ చేస్తూ వారి యోగక్షేమాలను చూసుకుంటారు. చేతనైనంత సాయం చేయడంలో అసలైన తృప్తి ఉందని అందుకే ఇవన్నీ చేసున్నానని, ఎవరేమనుకున్నా తనకు సంబంధం లేదని ఎప్పుడు చెబుతుంటాడు.

విద్యార్థి దశ నుంచే సామాజిక కార్యక్రమాలు చేయాలనే ఆలోచన



విద్యార్థి దశ నుంచే సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలనే ఆలోచన వచ్చింది. 25 ఏళ్లుగా సామాజిక కార్యక్రమాలు చేస్తున్నాను. సమాజానికి ఎంతో కొంత మేలు చేయాలనే ఉద్దేశ్యంతో వివిధ కార్యక్రమాలు చేస్తున్నాను. ఇక ముందూ చేస్తూ ఉంటాను. నా సంపాదనలో కొంత మేర ప్రజలకు ఉపయోగిస్తాను.

- నలుబాల వేణుగోపాల్, సామాజిక కార్యకర్త, హుజూరాబాద్

అదుపు తప్పిన వాహనాలు

- రోడ్డు పక్క షెడ్, దుకాణాల్లోకి దూసుకుపోయిన కంటైనర్, కారు
- ఆస్తి నష్టం... పోలీసులకు ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 23: రోడ్డుపై వెళ్లాల్సిన వాహనాలు అదుపుతప్పి పక్కన దుకాణాలు, టీ కొట్టుల్లోకి దూసుకుపోతున్నాయి. అతివేగం, మద్యం మత్తులో వాహనాలు నడపటం మూలంగానే ఈ ప్రమాద ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. 12 గంటల వ్యవధిలో కరీంనగర్‌లో రెండు సంఘటనలు చోటుచేసుకోగా అదృష్టవత్తు ఎవరూ గాయపడనప్పటికీ ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ మానేరు బైపాస్‌రోడ్‌లో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో శివానగర్ వ్యాన్‌ల అడ్డా వద్ద ఒక భారీ కంటైనర్ పద్మనగర్ వైపు నుంచి బైపాస్‌రోడ్ గుండా విశాఖపట్నంకు వెళుతూ రోడ్డు పక్కన టీ షాపు షెడ్‌లోకి దూసుకుపోయింది. దీంతో షెడ్ కూలిపోగా, అందులోని ఫర్నిచర్, బైక్, కారు ధ్వంసమయ్యాయి. సుమారు 3.5 లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని టీ షాపు యజమాని నర్సయ్య రెండో ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ విజయ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. కంటైనర్ డ్రైవర్‌తో పాటు మరొకరిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. సంఘటనా స్థలంలో వీధిదీపాలు లేకపోవటంతో పాటు చీకట్లో డ్రైవర్ మత్తులో ఉండి అతివేగంగా నడపటంతో అదుపుతప్పి షెడ్‌ను ఢీకొట్టిందని స్థానికులు తెలిపారు. బుధవారం ఉదయం 8:30 గంటల ప్రాంతరంలో తిరుమల్‌నగర్‌లో అంబేద్కర్ స్టేడియం చౌరస్తాలో ఒక కారు అదుపుతప్పి రోడ్డు పక్కన కిరాణంషాపులోకి దూసుకుపోయింది. షాపులోని వస్తువులు కొన్ని ధ్వంసమై నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు. ఎదురుగా స్కూల్ వ్యాన్ వస్తుండగా తప్పించబోగా అదుపుతప్పి కిరాణం షాపులోకి దూసుకుపోయిందని తెలిపారు. కారును నడుపుతున్న వ్యక్తిని పోలీసులు విచారిస్తున్నారు.



షెడ్‌ను ఢీకొట్టిన కంటైనర్



ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

దాడి కేసులో ఒకరికి జైలు శిక్ష

చందుర్తి అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంటి గోడ విషయంలో మహిళపై దాడికి చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ.2000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి జ్యోతిర్మయి తీర్పు వెల్లడించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లికి చెందిన బొజ్జగట్టు వసంతతో బొజ్జగట్టు మోహన్‌కు ఇంటి పక్కన భూమి విషయంలో గొడవలు జరిగాయి. 16 ఆగస్టు 2014న వసంత ఇంటికి వెళ్లే దారికి అడ్డంగా మోహన్ గోడ నిర్మిస్తుండగా అడ్డుకున్న వసంతను దూషించడంతోపాటు కొట్టాడు. ఈ మేరకు బాధితురాలు చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి మోహన్‌కు జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

రైస్ మిల్లుల కేంద్రంగా మానకొండూర్

- వివిధ రాష్ట్రాల కూలీలకు ఉపాధి

మానకొండూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం ఉమ్మడి జిల్లా వ్యవసాయ ముఖ చిత్రాన్ని మార్చింది. ఎస్సారెస్పీ నీటితో భూములన్నీ సస్యశ్యామలమయ్యాయి. మానకొండూర్ ప్రాంతంలో వరి సాగు పెద్ద ఎత్తున్న పెరిగింది. ఇక్కడి నుంచి రోడ్డు సౌకర్యం ఉండడంతో మానకొండూర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో రైస్‌మిల్లులు వెలిశాయి. 40ఏళ్ల క్రితం మొట్టమొదటి రైస్ మిల్లును ఇక్కడ ఏర్పాటు చేశారు. మిల్లుల ఏర్పాటుతో స్థానికంగా ఉండే ప్రజలకు ఉపాధి లభించింది. క్రమక్రమంగా రైస్ మిల్లుల సంఖ్య పెరగడంతో ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు ఉపాధి కోసం రావడం ప్రారంభమైంది. మానకొండూర్, సదాశివపల్లి గ్రామాల్లో 40కిపైగా రైసుమిల్లులు కొనసాగుతున్నాయి. దాదాపు 1200 మంది కూలీలకు ఉపాధి లభిస్తోంది. కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు వరి ధాన్యం సేకరించి ఇతర రాష్ట్రాలతో పాటు రాష్ట్రప్రభుత్వానికి సీఎంఆర్ రైస్ అందిస్తూ ఉమ్మడి జిల్లాలో మానకొండూర్ ప్రత్యేక గుర్తింపు పొందింది. కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారికి పక్కన ఉన్న రైసు మిల్లులు జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్నాయి. మిల్ ఆపరేటర్లు, మెకానిక్‌లు, లారీ డ్రైవర్లు కూలీలు ఇలా పలు రంగాల్లో ఉపాధి పొందుతున్నారు. పొట్ట చేతపట్టుకొని వందల కిలోమీటర్ల నుంచి జీవనోపాధి కోసం భార్యాపిల్లలతో వచ్చిన కూలీలకు మిల్లుల యజమానులు వసతి కల్పిస్తున్నారు. ఒకప్పుడు రైస్ మిల్లులతోనే గుర్తింపు పొందిన ఈ ప్రాంతంలో ఇతర వ్యాపారాలూ ఊపందుకున్నాయి.



మానకొండూర్‌లో కూలీలకు ఉపాధీ కల్పిస్తున్న రైసుమిల్లు

న్యూస్ బాక్స్

అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా శ్రీరాములు నియామకం

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన డాక్టర్ గోసికొండ శ్రీరాములు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసిలోని బెనారస్ విశ్వవిద్యాలయంలో సామాజిక శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు ఎంపిక య్యారు. ఈ మేరకు యూనివర్సిటీలో విభాగాధిపతి నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. పోస్టుకు ఎంపిక కావడంపై స్థానికులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది తాత్కాలిక నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీరామ్ మొండయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధించేందుకు ఆసక్తి అర్హత కలిగిన వారు ఈనెల 26వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

అధికారుల దాడులు

గంగాధర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గర్షకుర్తిలో ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు దాడి చేసి కేసు నమోదు చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మరగ్గాలపై రంగుల వస్త్రాలు తయారు చేస్తున్న లచ్చయ్యపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. చెన్నయ్ నుంచి వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు, జిల్లా జౌళిశాఖ అధికారులు దాడిలో పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ముత్తారం అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతారం గ్రామానికి చెందిన ఓల్లెపు మొగిలి ఇంట్లో నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు బుధవారం పట్టుకున్నారు. అక్రమంగా నిలువ ఉంచిన బియ్యాన్ని పట్టుకొని పోలీస్ స్టేషన్లో మొగిలిపై సివిల్ సప్లై అధికారి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల వద్ద తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొని ఇతర ప్రదే శాలకు ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో స్థానిక పోలీసుల సహాయంతో సివిల్ సప్లై అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు ఈ మేరకు మొగిలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో 11 మందికి గాయాలు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 23: సిరిసిల్ల పట్టణంలో రగుడు బైపాస్ రహదారిపై బుధవారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో 11 మందికి తీవ్రగాయాలయ్యాయి. మెదక్ జిల్లా రాంపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్ కుటుంబ సభ్యులతో వేములవాడలో పెళ్లి చూపులకు కోసం బయలుదేరారు. సిరిసిల్ల పట్టణం చంద్రంపేట బైపాస్ తర్వాత రగుడు పాఠశాల వద్దకు చేరుకున్నారు. ఆ మార్గంలో రహదారిపై ధాన్యం ఆరబోయడంతో రోడ్డు బ్లాక్ చేశారు. దీంతో రూట్ మార్చుకొని వన్‌వేలో వెళ్తుండగా యూటర్న్ చేసుకొని అతివేగంగా వస్తున్న చందుర్తి మండలంలోని ఆశిరెడ్డిపల్లికి చెందిన మరో కారు ఎదుగా ఢీకొంది. దీంతో మహ్మద్ గౌస్ కారు అదుపు తప్పి ఎగిరి కల్వర్టు కిందపడింది. అందులో ప్రయాణిస్తున్న ఎమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. మరో కారు డి వైడర్‌కు ఢీకొట్టి ఆగిపోయింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బాధితులను స్థానికులు కారు నుంచి బయటకు తీసి చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. దసరా పండుగ రోజున ఇదే మార్గంలో చంద్రంపేటకు చెందిన వేముల శేఖర్ అనే వ్యక్తి ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడి తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బైపాస్ రహదారిపై ధాన్యం ఆరబోయడం, కల్వర్టు నిర్మాణంలో ఉండడం, రోడ్డుపై అక్కడక్కడ నిర్మాణం పూర్తి కాకపోవడంతో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సుల్తానాబాద్, ఆక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించారు. ఎలిగేడు మండలంలోని నారాయణరావుపల్లి గ్రామానికి చెందిన కరివేద రవీందర్‌రెడ్డి(38) అనే యువకుడు కరీంనగర్ నుంచి రాత్రి తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రాంగ్ రూట్లో ఎదురుగా వచ్చిన ఓ ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవీందర్‌రెడ్డి సంఘటన స్థలంలోనే మృతిచెందాడరని ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదం అనంతరం మృతదేహాన్ని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బుధవారం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు కరీంనగరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడని, ప్రతీ రోజు స్వగ్రామం నుంచి రాకపోకలు సాగిస్తుంటాడని తెలిసింది.

ఎన్టీపీసీలో ఒకరి దుర్మరణం

జ్యోతినగర్, అక్టోబరు 23: ఎన్టీపీసీ బీ టైపు గేటు సమీప రాజీవ్ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహ్మద్ ఖలీం(38) అనే దివ్యాంగుడు మృతిచెందాడు. గోదావరిఖని నుంచి తన స్కూటీపై రామగుండం వైపు వెళ్తున్నాడు. ముందుగా వెళ్తున్న ట్రాక్టర్ అకస్మాత్తుగా రోడ్డుపై ఆపడంతో వెనుకనే వస్తున్న ఖలీం వాహనం ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా చనిపోయాడు. ఖలీం స్వగ్రామం పెద్దపల్లి మండలం హన్మంతునిపేట. గోదావరిఖనిలోని మైనార్టీ గురుకులంలో ఔట్ సోర్సింగ్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని హన్మంతునిపేటకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఎన్టీపీసీ ఎస్‌ఐ సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

వేములవాడ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అనుపురంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. వేములవాడ మండలం అనుపురంలోని ప్రధాన రహదారిని ఆనుకొని చెట్ల పొదల్లో సుమారు 50 సంవత్సరాల వయస్సుగల పురుషుడి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురికి తరలించారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించిందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాలయంలో ఏర్పాటు చేసినకరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబరచాలన్నారు. ఎమ్మెల్యేను ప్రిన్సిపాల్ తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశం, మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్ మణిదీప్తి, నాయకులు మినుపాల ప్రకాష్‌రావు, సాయిరి మహేందర్, చిలుక సతీష్, జానీ, చిన్నయ్య, గుజ్జేటి వెంకన్న, విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానేరు వంతెన రెండు జిల్లాలకు వరం లాంటిది

ఓదెల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రూపునారాయణపేట మానేరువాగుపై వంతెన సౌకర్యం పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు వరం లాంటిదని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం రూపునారాయణపేట సమీపంలోని మానేరు వాగుపై మంజూరైన వంతెన నిర్మాణ ప్రాంతాన్ని ఎమ్మెల్యే విజయరమణారావు, ఆర్‌అండ్‌బీ ఈఈ, జేఈలతో కలిసి సందర్శించారు. ఓదెల మండలం రూపునారాయణపేట, మానేరు వాగు నుంచి జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామాల మీదుగా నిర్మాణం చేపట్టే స్థలాన్ని పరిశీలించి అంచనా వ్యయాన్ని సమీక్షించారు. గ్రామాల్లో వెడల్పు, వంతెన పొడవులపై చర్చించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ వంతెన నిర్మాణమైతే రైతులకు జమ్మికుంటలోని మార్కెట్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం రూ. 80 కోట్లు కేటాయించగా, అదనంగా ఎన్ని కోట్ల నిధులైనా కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అంతకుముందు గుంపుల నుంచి జమ్మికుంట వైపు వెళ్లే ప్రధాన రహదారి ధ్వంసం కావడంతో అప్రోచ్ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, అంకం రమేష్, బోడకుంట స్వామి, బొంగోని శ్రీనివాస్, ఆకుల మహేందర్, పడాల రాజు, సిరిసేటి రాహుల్, రెడ్డి రజనీకాంత్, కోట నిరంజన్ రెడ్డి, నీర్ల శ్రీనివాస్, చింతం కుమారస్వామి, నాగపూరి రవి గౌడ్, చీకట్ల ముండయ్య, సంద మహేందర్, తిప్పారపు సంపత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో 150 మంది విద్యార్థులు



బస్సులో విద్యార్థులు

మల్యాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో గల నూకపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు రవాణా సౌకర్యం లేకపోవడంతో ఆర్టీసీ బస్సుల్లో వందలాదిగా ఇబ్బందుల మధ్య ప్రయాణిస్తున్నారు. ఈ స్కూల్‌కు మండలంలోని పలు గ్రామాల నుంచి వందలాదిగా విద్యార్థులు వస్తుంటారు. అయితే వీరందరి కోసం జగిత్యాల డిపోకు చెందిన రెండు ఆర్టీసీ బస్సులు ఒక్కో ట్రిప్ ద్వారా విద్యార్థులను స్కూల్‌కు చేరవేస్తుంటాయి. అయితే బస్సులో 60 మంది లోపే ప్రయాణించే అవకాశం ఉండగా నిత్యం 150 మందికి పైగా విద్యార్థులు ప్రమాదపుటంచున ప్రయాణిస్తున్నారు. బుధవారం బస్ పాస్ లేని వారే 140 మంది ఉన్నట్లు తెలిసింది. దీంతో తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. రెండు బస్సులను రెండు ట్రిప్పుల చొప్పున నడుపాలని కోరుతున్నారు

నయా ట్రెండ్..



మల్యాపూర్‌లోని ఫాంహౌస్‌లో స్విమ్మింగ్‌పూల్ లోపలి భాగం

ప్రస్తుతం ఫంక్షన్ల నిర్వహణలో కొత్త ట్రెండ్ నడుస్తోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రస్తుతం ఫాంహౌస్ కల్చర్ నడుస్తోంది. గెట్‌టు గెదర్‌లు మొదలుకొని హల్దీ, సంగీత్ ఇలా రకరకాల ఫంక్షన్లను ఫాంహౌస్‌ల్లో నిర్వహిస్తున్నారు. కరీంనగర్ పరిసరాల్లో పదుల సంఖ్యలో ఫాంహౌస్‌లు వెలిశాయి. ఈ ఫాంహౌలక్ష రెయిన్‌డ్యాన్స్ స్టేజీ, స్విమ్మింగ్ పూల్, ఓపెన్ కిచెన్, నైట్ ఫైర్, ఫొటో షూట్ వంటి అధునాతన సౌకర్యాలు ఉన్నాయి. ఆహ్లాదకర వాతావరణంలో ఫంక్షన్లు చేసుకునే అవకాశం ఉంది. నిర్వాహకులు అందుబాటు ధరల్లో అన్ని వసతులు కల్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఫాంహౌస్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు.

- ఫాంహౌస్‌ల్లో ఫంక్షన్లు
- కరీంనగర్‌లో పదుల సంఖ్యలో ఏర్పాటు
- స్విమ్మింగ్‌పూల్‌లు, రెయిన్ డ్యాన్స్‌లతో అధునాతన సౌకర్యాలు

భగత్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఫాంహౌస్ కల్చర్ రోజురోజుకు పెరిగిపోతోంది. కరీంనగర్ పరిసరాల్లో పదుల సంఖ్యలో ఫాంహౌస్‌లు వెలిశాయి. తమ ఫంక్షన్లను ఫాంహౌస్‌లలో నిర్వహించుకునేందుకు ప్రజలు ఇష్టపడుతున్నారు. కొత్తపల్లి మండలంలోని మల్యాపూర్, రేకుర్తి, చింతకుంట, కమాన్‌పూర్‌తోపాటు కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూరు సమీపంలో ఫాంహౌస్‌లు నిర్మించారు. ఆహ్లాదకర వాతావరణం, ఆత్మీయుల మధ్య పార్టీలను ఫాంహౌస్‌లలో చేసుకోవాడానికి ప్రజలు ఇష్టపడుతున్నారు.



ఫాంహౌస్‌లో ఏర్పాటు చేసిన రెయిన్‌బాత్ స్టేజీ, ఈఫిల్ టవర్ నమూనా

● అత్యాధునిక వసతులు

ఫాంహౌస్‌ల్లో అత్యాధునిక వసతులు కల్పిస్తున్నారు. ఏసీ రూంలు, వైఫై సదుపాయం, వాష్ రూంల్లో గీజర్ ఏర్పాటు చేస్తున్నారు. సూట్ రూంలు అందుబాటులో ఉంటున్నాయి. ఆహ్లాదకరమైన గార్డెనింగ్, పెళ్లికి కావాల్సిన సంప్రదాయ వస్తువులు, సంగీత్ కార్యక్రమానికి అవసరమైన వసతులతోపాటు, గ్రామీణ ప్రాంతాల్లో పెళ్లిల్లో వాడే వస్తువులు, ఎడ్లబండ్లు, చేద బావితో పాటు అన్ని వస్తువులను ఫాంహౌస్‌లలో సమకూరుస్తున్నారు. రెయిన్‌డ్యాన్స్ స్టేజీ, కిచన్‌తోపాటు, ప్రైవేట్ కిచెన్‌లను అందుబాటులో ఉంచుతున్నారు. ఫ్యామిలీలు ఉండడానికి వసతి సదుపాయం, ప్రైవేట్ స్విమ్మింగ్ పూల్, నైట్‌ఫైర్, ప్రొజెక్టర్, ఫొటో షూట్ కోసం అనువైన వాతావరణాన్ని సమకూరుస్తున్నారు. అన్ని ఫాంహౌస్‌లలో వాహనాలు పార్కింగ్ చేయడానికి ప్రత్యేక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.

● అన్ని రకాల ఈవెంట్స్‌కు అనుకూలం

ఫాంహౌస్‌ల్లో అన్నిరకాల ఈవెంట్స్ చేసుకోవడానికి వసతులు కల్పిస్తున్నారు. పెళ్లికి ముందు సంగీత్, హల్దీ వేడుకలు, బ్రైడ్‌గ్రూమ్ సెర్మన్, డెస్టినేషన్ వెడ్డింగ్, రిసెప్షన్ పార్టీలు, ఫ్యామిలీ ఔటింగ్‌లు, గెట్ టు గెదర్‌లు, బర్త్ డే పార్టీలు, రిటైర్‌మెంట్ ఫంక్షన్స్, బ్యాచ్‌లర్ పార్టీస్, సర్‌ప్రైస్ పార్టీలు, కార్పొరేట్ ఈవెంట్స్, కిట్టీ పార్టీలు, ఫొటో షూట్‌లు మొదలుకొని ఆత్మీయ సమ్మేళనాలు ఇలా ఏ సెలబ్రేషన్స్ అయినా ఫాంహౌస్‌లలో నిర్వహించుకోవచ్చు.

● అందుబాటులో ధరలు

ఫాంహౌస్‌లలో చిన్న కార్యక్రమాలతోపాటు పెద్ద పార్టీలు నిర్వహించడానికి ధరలు అందుబాటులో ఉండడంతో ఈవెంట్స్ చేసుకోవడానికి నగరవాసులు ఇష్టపడుతున్నారు. ఫాంహౌస్‌లో ఉన్న వసతులను బట్టి ఎనిమిది వేల రూపాయల నుంచి ఇరవైవేల రూపాయల వరకు ధరలు నిర్ణయించారు. పది మంది సభ్యుల నుంచి మొదలుకుని వందల సంఖ్యలో కార్య క్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఫాంహౌస్‌ల్లో వసతులు కల్పించారు. కొన్ని ఫాంహౌస్‌ల్లో విద్యుత్ అంతరాయం లేకుండా బ్యాకప్ సదుపాయం కూడా కల్పించారు.



మల్యాపూర్‌లోని ఫాంహౌస్‌లో ఏర్పాటు చేసిన ఊయల

● అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం..



అన్ని ఫంక్షన్లకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తు న్నాం. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. అందుబాటు ధరలోనే ఫాం హౌస్ లభిస్తుండడంతో ప్రజలు ఆదరిస్తున్నారు.

- శ్రవణ్, ఆర్‌కే రిసార్ట్స్ యజమాని





ఫాంహౌస్‌లో ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన ఈవెంట్‌లు

4 నుంచి ఎంఎడ్ పరీక్షలు

గణేశ్‌నగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎస్‌యూ పరిధిలోని ఎంఎడ్ నాలుగో సెమిస్టర్ పరీక్షలు నవంబరు4 నుంచి, రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 5 నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయం త్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం యూనివర్సిటీ www satavahana.ac.inలో సందర్శించాలని సూచించారు.

● ఎస్‌యూ పరిధిలోని ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 4 నుంచి ప్రారంభం అవుతాయని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

గవర్నర్‌ను కలిసిన ఎస్‌యూ వీసీ

గణేశ్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ బుధవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాజ్‌భవన్‌లో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశంతో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా శాతవాహన యూనివర్సిటీ చేపట్టబోయే రెండో కాన్వకేషన్‌కు ముఖ్య అతిథిగా రావాలని గవర్నర్‌ను కోరగా ఆయన సానుకులంగా స్పందించారని వీసీ ఉమేశ్ కుమార్ తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని గవర్నర్ సూచించారన్నారు.

ఇద్దరి అరెస్టు

ఇల్లంతకుంట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో రుణాలు ఇప్పిస్తామని 12 మందిని మోసం చేసిన కముటం మౌనిక, కందుకూరి శ్రీధర్‌చారిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలం సదాశివపల్లి గ్రామానికి చెందిన మౌనిక భర్తతో విడిపోయి కరీంనగర్‌లో ఉంటోంది. ఇదే సమయంలో శ్రీధర్‌చారితో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి మౌనిక తల్లిగారి గ్రామమైన పెద్దలింగాపూర్‌కు చేరుకొని శ్రీధర్‌ను బ్యాంకు అధికారిగా పరిచయం చేసింది. కేంద్రప్రభుత్వ పథకం ముద్ర యోజన కింద ఒక్కొక్కరికి రూ.10లక్షల రుణం ఇప్పిస్తామని నమ్మబలికింది. పెద్దలింగాపూర్, రహీంఖాన్‌పేట, లక్ష్మీపూర్, కొడిముంజ గ్రామాలకు చెందిన 12 మంది దగ్గర నుంచి రూ 3.45లక్షలు వసూలు చేసి తప్పించుకు తిరుగుతున్నారు. పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన బండారి శంకర్ ఫిర్యాదు మేరకు బుధవారం ఇద్దరిని హైదరాబాద్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పాలకుర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని జయ్యారం గ్రామ శివారులో బుధవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల మేరకు.. కేశోరాం సిమెంటు కర్మాగారంలో కాంట్రాక్ట్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న సందవెన గట్టయ్య (54) బసంత్‌నగర్ నుంచి తన స్వగ్రామమైన గోపాల్‌రావుపేటకు వెళుతుండగా మార్గమధ్యంలోని జయ్యారం గ్రామశివారులో బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య మల్లీశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం: డీఐఈవో



-క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో అండర్-19 ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా అండర్-19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జి. మధుజాన్సన్, ప్రభుత్వ ఆర్ట్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యవర్ధన్‌రావు, అడిషనల్ ఎస్పీ, రీజినల్ విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంట్ ఆఫీసర్ అచ్చేశ్వర్‌రావు, టిజిఎంఎస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు సంపత్‌రావు, ఫిజికల్ డైరెక్టర్లు ప్రసాద్, సరిత, సుజాత, శివ, అనూప్‌రెడ్డి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రైలులో మగ బిడ్డకు జన్మనిచ్చిన ప్రయాణికురాలు



ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

అంతర్గాం అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎక్స్‌ప్రెస్(ఢిల్లీ-సికింద్రాబాద్)లో ఆగ్రా నుంచి కరీంనగర్ వెళ్తున్న సోమ స్వాతి బుధవారం రైలులోనే మగ బిడ్డకు జన్మనిచ్చింది. రైలు మందమర్రి వరకు రాగానే స్వాతికి పురిటి నొప్పులు రావడంతో స్పందించిన రైల్వే టీసీ 108 సిబ్బందికి సమాచారం అందించారు. రైలు రామగుండం చేరేలోగా 108 సిబ్బంది రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే స్వాతి ప్రసవం కావడంతో 108సిబ్బంది గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సీసీఐ బోణీ

- మొదటి రోజు 11.70క్వింటాళ్లు కొనుగోలు
- మద్దతు ధర రూ.7,270గా నిర్ణయించిన అధికారులు



మార్కెట్ యార్డులో పత్తిని పరిశీలిస్తున్న అధికారులు

జమ్మికుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) బుధవారం బోణి కొట్టింది. వరంగల్ జేడీఎమ్ వి శ్రీనివాస్, డీడీఎమ్ పద్మావతి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రకాష్, ఆర్డీవో రమేష్‌బాబు, మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం, సీసీఐ సెంటర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వీణవంక మండలం హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన నల్లా రవీందర్‌రెడ్డి 11.70క్వింటాళ్ల విడి పత్తిని విక్రయానికి తీసుకు వచ్చాడు. సీసీఐ అధికారులు పరిశీలించగా 19శాతం తేమ వచ్చింది. తేమ ఎక్కువగా ఉన్నప్పటికి నాణ్యత బాగుండటంతో మార్కెటింగ్‌శాఖ అధికారుల వినతి మేరకు సీసీఐ రూ.7270.37మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చింది. కాని సదరు రైతు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దీంతో అతడి సమీప బంధువు అయిన వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వంగల వెంకట్‌రెడ్డి పేరిట విక్రయించాడు. ఈ సందర్భంగా డీడీఎమ్ పద్మావతి మాట్లాడుతూ నాణ్యమైన పత్తి విక్రయానికి తీసుకు వచ్చి ప్రభుత్వ మద్దతు ధర రూ.7521 పొందాలని రైతులకు సూచించారు. 8నుండి 12శాతం తేమ ఉన్న పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుందని, రైతులు ఇంటి వద్దనే పత్తి ఆరబెట్టుకోని కొనుగోలు కేంద్రానికి తీసుకు రావాలన్నారు. ఆధార్‌కార్డు, పట్టాదారి పాస్ బుక్, బ్యాంక్ పాస్‌బుక్, జిరాక్స్ ప్రతులను వెంట తీసుకు రావాలన్నారు. దళారులు, మధ్యవర్తులను నమ్మి రైతులు మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకొని మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో ద్వితీయశ్రేణి కార్యదర్శి ఎస్ రాజా, అడ్తీదారులు రైతులు పాల్గొన్నారు.

ఒగ్గు కళ నుంచి సినీ రంగం వైపు..

- వరుస అవకాశాలతో రాణిస్తున్న మల్లేశం
- బ్రహ్మచారి సినిమాతో హీరోగా గుర్తింపు

కళారంగంపై ఉన్న ఆసక్తి ఆ యువకుడిని టాలీవుడ్ వైపు తీసుకెళ్లింది.. మొదట ఒగ్గు కళాకారుడిగా ప్రదర్శనలు ఇస్తూ ప్రేక్షకులను కట్టిపడేసేవాడు. ఎక్కడ ప్రదర్శన ఇచ్చిన వందల సంఖ్యలో గుమిగూడేవారు. ఒగ్గుకథకుడిగా ప్రత్యేక గుర్తింపు రావడం, నటనపై ఉన్న ఇష్టంతో యూట్యూబ్ ఛానల్ ప్రారంభించాడు. వివిధ షార్ట్ ఫిలింలు రూపొందించి అప్‌లోడ్ చేశాడు. అవి సినీ పెద్దల దృష్టిలో పడడంతో సినీ రంగంలో అవకాశాలు వచ్చాయి. వివిధ ప్రాతలు పోషిస్తూ మంచి నటుడిగా గుర్తింపు పొందాడు.



మహిళ వేషధారణలో మల్లేశం



షార్ట్ ఫిలింలో గొర్రెల కాపరి గెటప్‌లో గుంట మల్లేశం



బ్రహ్మచారి సినిమా పోస్టర్‌లో గుంట మల్లేశం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి): వేములవాడ మండలం ఫాజుల్‌నగర్ గ్రామానికి చెందిన గుంట మల్లేశంకు చిన్న తనం నుంచి కళారంగం అంటే ఇష్టం. కులవృత్తిలో భాగం గా తన తండ్రి ఒగ్గు కథలు చెబుతుండడం గమనించేవాడు. తండ్రి వద్ద ఒగ్గు కథలు చెప్పడం నేర్చు కున్నాడు. భావయుక్తంగా కథలు అల్లుతూ ప్రేక్షకు లను కట్టిపడేసేవాడు. ఒగ్గు కథల్లో ఆడ వేశధారణ మల్లేశంకు కళాకారుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. ఇలా ఒగ్గుకథలతో రాణిస్తున్న మల్లేశంకు షార్ట్ ఫిలింస్ తీయాలనే ఆలోచన వచ్చింది. జీఎం ఫోక్స్ పేరిట యూట్యూబ్ ఛానల్ ప్రారంభించాడు. చిన్న చిన్న కథలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశాడు. ప్రేక్షకుల మంచి ఆదరణ లభించింది. దీంతో 500కు పైగా షార్ట్ ఫిలింస్, 100కు పైగా ఫోక్ సాం గ్స్ చేశాడు. యూట్యూబ్ ద్వారా మల్లేశంకు సినిమా ల్లో అవకాశం లంభించింది. మందుగా 'సైన్యం' సినిమాలో రాజకీయ నాయకుడి కార్యకర్తగా సైడ్ క్యారె క్టర్‌గా చేశాడు. వరుసగా 'సైదులు, బద్మాష్' సిని మాల్లో పలు పాత్రల్లో నటించాడు. అనంతరం 'బ్రహ్మచారి' అనే కామెడీ సినిమాలో హీరోగా అవకాశం లభించింది.



హీరో సుమన్‌తో గుంట మల్లేశం

బ్రహ్మచారి సినిమాకు అవార్డు

బ్రహ్మచారి సినిమాను తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నంది అవార్డుకు ఎంపిక చేశారు. బ్రహ్మచారి సినిమాకు మొదటి షోతోనే మంచి పబ్లిక్ టాక్ వచ్చింది. దీంతో వరసగా మల్లే శంకు అవకాశాలు వస్తున్నాయి. 'రాజుగాడు రాజైతే, శివశంభో' సినిమాల్లో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నా డు. త్వరలో తీయబోయే 'బ్రహ్మచారి-2' సినిమాలో నటించనున్నాడు.

న్యూస్ బాక్స్

బీసీ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా బాలరాజు

ఇల్లంతకుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బీసీ మహాసభ జిల్లా అధ్యక్షుడుగా మండలకేంద్రానికి చెందిన కూన బోయిన బాలరాజును నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాసులు ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు జిల్లాలోని బీసీ సంఘాల నాయకులను కలుపుకొని త్వరలోనే జిల్లా కమిటీ, అనుబంద కమిటీలను ఏర్పాటు చేస్తానని, తన నియామకానికి సహకరించినవారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఆలయ శిఖర పూజ

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని లక్ష్మీకేశవ పెరుమాండ్ల ఆలయ శిఖర పూజను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు తివిక్రం విష్ణు, విజయ్ నవ ధాన్యాల పూజ, అర్చన తదితర కార్యక్రమాలను చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు రాంరెడ్డి, జితేందర్, వెంకటేశ్‌గౌడ్, నరేశ్, చంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సయ్య, లక్ష్మ్రెడ్డి, నర్సయ్య, వెంకటనర్సింహారెడ్డి, బాబు, శ్రీనివాస్‌యాదవ్, కిష్టారెడ్డి, రాజునాయక్, బుచ్చాగౌడ్, శ్రీనివాస్, రాములు, బాల్‌రెడ్డి, అంజాగౌడ్, శ్రీపాల్‌రెడ్డి, చందు, సంతోష్, దేవదాసు, రాంరెడ్డి పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ మండల కార్యవర్గం

వీర్నపల్లి, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) వీర్నపల్లి మండల నూతన కమిటీని జిల్లా కార్యదర్శి తిరుపతి జాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చేకూటి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కముటం శేఖర్, ఉపాధ్యక్షుడిగా రవి, మహిళ ఉపా ధ్యక్షురాలిగా సుమలత, కోశాధికారిగా జనార్దన్ ఎన్నికయ్యారు.

సహకార సంఘం సేవలు భేష్

ముస్తాబాద్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుగల్ సహకార సంఘం సేవలు బాగున్నాయని ముంబాయి నాబార్డు బృందం కితాబిచ్చింది. బుధవారం పోతుగల్ సహకార సంఘాన్ని నాబార్డు ఏజీఎం అభిషేక్ (ముంబాయి), బోస్టన్ గ్రూప్ ఇండియా ప్రతినిధి ఆర్యన్, జిల్లా కేంద్ర బ్యాంకు సీఈవో సత్యనారాయణ రావు, ప్యాక్స్ డెవలప్‌మెంట్ సెల్ మెనేజర్ సత్యనారాయణ, కేడీసీసీ జనరల్ మేనేజర్ శ్రీధర్, రియాజ్, జిల్లా నాబార్డు డీడీఎం జయప్రకాశ్ సందర్శించారు. చైర్మన్ తన్నీరు బాపురావు సహకార సంఘం అందిస్తున్న సేవలను వివరించారు. సహకార సంఘం పదేళ్లలో నష్టాల్లో నుంచి లాభాల్లోకి అడుగు పెట్టిన తీరును వివరించారు.

ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

ఇల్లంతకుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్, చిక్కుడువానిపల్లె, రహీంఖాన్‌పేట, వల్లంపట్ల, కందికట్కూర్, పొత్తూరు గ్రామాలలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వం రైతులు దళారీల బారినపడి నష్టపోవద్దని అన్ని గ్రామాలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్‌చైర్మన్ తిరుపతిరెడ్డి, ఏఎంసీ చైర్మపర్సన్ ఐరెడ్డి చైతన్యమహేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ గన్నారం వసంతనర్సయ్య, యువజన కాంగ్రెస్ నాయోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి పసుల వెంకటి, నాయకులు ప్రసాద్, స్వప్నకర్ణాకర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, వెంకటరెడ్డి, చల్ల నారాయణ, ఆకుల సత్యం, యాస తిరుపతి, మల్లయ్య, రాజేశం, కొమురయ్య, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు

సిరిసిల్ల రూరల్: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి రాష్ట్ర ప్రభుత్వం అందించే మద్దతు ధరలను పొందాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెల్ముల స్వరూప తిరుపతి రెడ్డి కోరారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 22 వవార్డు పెద్ద బోనాల, 10వ వార్డు చిన్నబోనాల, ముష్టిపల్లి గ్రామాల్లో మెప్మా ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మంచే శ్రీనివాస్, కౌన్సిలర్‌లు బోల్గం నాగరాజుగౌడ్, బుర్ర లక్ష్మీశంకరయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ బుర్ర మల్లిఖార్జున్‌గౌడ్, మెప్మ టీఎంసీ రాజేశం, మార్కెట్ కమిటి డైరెక్టర్‌లు నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం గజసింగవరంలో బుధవారం సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయతిరుపతి ప్రాంభించారు. సింగిల్‌విండో వైస్ చైర్మెన్ రామాంజనేయులు, సీఈవో రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగరాజు, బోన్ల సత్యం, విండో డైరెక్టర్లు మురళి, రాజవీర్, నర్సయ్య, నాయకులు రామచంద్రారెడ్డి, వెంకటి, పర్శరాములు, సురేష్, బాలయ్య ఉన్నారు.

గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొమిరిశెట్టి విజయతిరుపతి ప్రారంభించారు. సింగిల్‌విండో సీఈవో రాజిరెడ్డి, పలు పార్టీలకు చెందిన నాయకులు బండ రమేష్, కొక్కు రాజం, ప్రసాదరావు, కృష్ణకాంత్ ఉన్నారు.

వీర్నపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని ఏఎంసీ చైర్మన్ లకావత్ రాములు నాయక్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు భూక్యతండా, ఎర్రగడ్డతండా, గర్జనపల్లి, శాంతినగర్ గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ మారుతి రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ లెంకెల లక్ష్మణ్, ఏపీఎం నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిటి యాదవ్, ఐకేపీ సీసీ శ్యామల, ఏఎంసీ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: రైతులకు సహకార సంఘాలు అండగా ఉంటాయని ప్యాక్స్ చైర్మన్, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఏనుగు తిరుపతి రెడ్డి అన్నారు. ఫాజుల్ నగర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సహకార సంఘాలు అండగా ఉంటాయని, పండించిన ధాన్యాన్ని అమ్మడానికి ఇబ్బందులు పడకుండా సొసైటీ సంఘాలు కొనుగోలు చేస్తున్నాయన్నారు. వైస్ చైర్మన్ లక్ష్మీ కాంతారావు,డైరెక్టర్లు కొండ శేఖర్,దొబ్బల మల్లేశం, దొంతరవేణి రాజయ్య, సంజీవ రెడ్డి, చిందం తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హనుమండ్లు పాల్గొన్నారు



ముస్తాఫనగర్‌లో ప్రారంభిస్తున్న చైర్ పర్సన్

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో మాదిగ, మాదిగ ఉపకులాలు ఐక్యతతో సత్తాచాటలని మాదిగ, మాదిగ ఉపకులాల ఐక్య వేదిక కన్వీనర్ కత్తెర దేవదాస్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద మాదిగ, మాదిగ ఉపకులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆత్మగౌరవ సభ నిర్వహించారు. వేదిక కన్వీనర్ కత్తెర దేవదాస్ అధ్యక్షత వహించారు. అంతకుముందు అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి ఐక్య వేదిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి చేనేత విగ్రహం, పెద్ద బజార్, గాంధీచౌక్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఆత్మగౌరవ సభలో దేవదాస్ మాట్లాడారు. పది సంవత్సరాలుగా సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏనాడూ మాదిగల సభకు అనుమతి ఇవ్వలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో మాదిగ కళా బృందాల కృషిని గత ప్రభుత్వాలు గుర్తించ లేదన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మాదిగ, మాదిగ ఉపకులాలను చైతన్య పరిచే దిశగా మాదిగ కళా బృందాలు కృషి చేయాలన్నారు. మాదిగ కళా బృందాలకు ఆర్థిక సహాయంతోపాటు సిరిసిల్లలో భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వం కులాల మధ్య వైశన్యాలు లేపి వారి మధ్య చిచ్చు పెట్టి విడదీసిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్ల ప్రాతిపదికన అన్ని మాదిగల సీట్లను గెలిచి సత్తాను చాటాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని ప్రతీ మండలంలో మాదిగల ఆత్మగౌరవ ఆత్మీయ సమ్మేళనాలను ఏర్పాటుకు రూపకల్పన చేసుకుందామన్నారు. 30 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని ఉద్యమం చేశారన్నారు. ఆయన పోరాట ఫలితంగా సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలను ఇచ్చిందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ పూర్తి చేశాకే ప్రభుత్వం ఉద్యోగాల నియామకాలు చేపట్టాలన్నారు. ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం సానుకూలంగా ఉన్నా మంద కృష్ణ మాదిగ సారథ్యంలో ఎస్సీ వర్గీకరణను తొందరగా అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఆత్మగౌరవ సభలో ఐక్య వేదికపై మాదిగ కళా బృందం ఆటాపాటలతో అలరించింది. ఈ సమావేశంలో వేదిక నాయకులు ఆవునూరి ప్రభాకర్, అంకని భాను, ఖానపురం లక్ష్మణ్, గుండ థామస్, లింగంపల్లి సత్యనారాయణ, కొట్టెపల్లి సుధాకర్, యెలగందుల భిక్షపతి, గడ్డం వెంకటస్వామి, నేదూరి లక్ష్మణ్, ఆవునూరి వెంకటరాములు, తాళ్లపల్లి ప్రభాకర్, బొడ్డు రాములు, గడ్డం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తాజా మాజీ సర్పంచుల ఉద్యమానికి మద్దతు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : తాజా మాజీ సర్పంచుల ఉద్యమానికి బీజేపీ మద్దతు ఉంటుందని మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్ అన్నారు. సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలోని తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 6వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచులు అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులను చేశారన్నారు. గత ప్రభుత్వం మోసం చేస్తే ప్రస్తుత ప్రభుత్వం తాజా మాజీ సర్పంచులను నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ నాయకులు ప్రశాంత్, సాయికుమార్, సాగర్, రుద్రంగి మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ దప్పుల అశోక్, మాజీ డైరెక్టర్ ఇస్మాయిల్, కొలనూరు సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్ తాజా మాజీ సర్పంచుల రిలే నిరాహారదీక్షలకు మద్దతు తెలిపారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



నిరాహారదీక్షలో తాజా మాజీ సర్పంచులు

నిత్యం సాధన చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిత్యం తమ పాఠ్యాంశాలను చదువుతూ, రాస్తూ సాధన చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. జిల్లా కేంద్రంలోని గీతా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. మధ్యాహ్నం పరీక్ష కోసం విద్యార్థులు చదువుతుండగా, పలు అంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు కోసం సిద్ధం చేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయిని శారద మెనూను కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థులు తరగతి గదుల్లో నిత్యం జరిగే అన్ని పాఠాలకు సంబంధించి నోట్స్ తయారు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రోజు వాటిని చదవడం.. రాయడంతో పట్టు సాధిస్తారని పేర్కొన్నారు.

రోడ్డు పనులు అడ్డుకున్న దంపతులు

● చేపట్టాలని గ్రామస్థులు, విద్యార్థుల ధర్నా

చందుర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం జోగాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లే రోడ్డు పనులను గ్రామానికి చెందిన దంపతులు బుధవారం అడ్డుకోవడంతో వివాదానికి దారి తీసింది. పాఠశాలకు వెళ్లే రోడ్డు మట్టి రోడ్డు కావడంతో వర్షాకాలంలో విద్యార్థులు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరవగా బుధవారం ప్రారంభించారు. రోడ్డు నిర్మాణంతో తమ భూమి పోతుందని గ్రామానికి చెందిన బీరయ్య-ఐలయ్య దంపతులు టిప్పర్ వాహనం వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు, విద్యార్థులు ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న సీఐ వెంకటేశ్వర్లు గ్రామస్థులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.

ఉపాధిహామీ కూలీకి వేతనం అందజేత

చందుర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో అధార్ అనుసంధానం చేయడంలో అధికారుల తప్పిదంతో ఓ ఉపాధి హామీ కూలి వేతనం మరో వ్యక్తి బ్యాంక్ ఖాతాలో జమైంది. బుధవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'అధికారుల తప్పిదం అందని వేతనం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. ఏపీడీ నరసింహులు చందుర్తి మండల పరిషత్‌లో లింగంపేటకు చెందిన ఉపాధిహామీ కూలి కర్ల నర్సయ్యను విచారించారు. అనంతరం రుద్రంగికి చెందిన మరో వ్యక్తి నర్సయ్య ఖాతాలో జమైన రూ.10,944, లింగంపేటకు చెందిన ఉపాధిహామీ కూలీ కర్ల నర్సయ్యకు ఇప్పించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో నటరాజన్, ఏపీవో రాజయ్య పాల్గొన్నారు.

దొంగ నక్షతో స్థలం కబ్జా

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వారతస్వంగా తనకు వచ్చిన 150 గజాల స్థలాన్ని కొందరు దొంగ నక్షతో కబ్జా చేసుకున్నారని తనకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సిరిసిల్ల పట్టణం గోపాల్‌నగర్‌కు చెందిన ఖాజా ముషిరుద్దీన్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల పట్టణం గోపాల్ నగర్ తన స్థలంపై కొందరు దొంగ నక్షా తాయరు చేశారని, మున్సిపల్‌లో ఇంటి నిర్మాణానికి అనుమతి పొందారని ఆరోపించారు.

రేషన్ కార్డులు ఇప్పించాలని పోస్టర్

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవత్‌రెడ్డి రేషన్ కార్డులు ఇప్పించాలని గుర్తు తెలియని వ్యక్తి కాంగ్రెస్ కార్యకర్త పేరుతో బుధవారం రాత్రి సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్‌లోని మహాత్మ గాంధీ విగ్రహానికి పోస్టర్ అంటించాడు. సంఘటన వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే పోస్టర్‌ను తొలగించారు. కేసీఆర్ ప్రభుత్వంలో తకు రేషన్ కార్డులు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇవ్వాలని రాసి ఉంది.

ఉపాధ్యాయుల ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, పాఠశాలలను విద్యాశాఖ అధికారులు నిత్యం తనిఖీ చేయాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం డీఈవో రమేష్‌కుమార్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలో ఉన్న ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలను సందర్శించామన్నారు. కొన్నిరోజులుగా జరుగుతున్న పరిణామాలను దృష్ట్యా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను విద్యాశాఖ అధికారులు తనిఖీ చేయాలన్నారు. తగిన సూచనలు, అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పలు ప్రవేటు పాఠశాలలు సెలవు రోజుల్లో స్పెషల్ క్లాసుల పేరిట అదనపు తరగతులు నిర్వహిస్తున్నాయని, విద్యార్థులకు మానసిక ప్రశాంతత లేకుండా చేస్తున్నాయని, ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టలను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులుమట్టి శ్రీనివాస్, గడుదాస్ మహేష్, వెంకటేష్, ముద్దం అనిల్‌గౌడ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



డీఈవోకు వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్ డిమాండ్ చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ అధ్వర్యంలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులతో రగుడు అంబ్కేదర్ చౌరస్తానుంచి ర్యాలీ జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్బంగా జిల్లా కార్యదర్శి రంజిత్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లతోపాటు ఫీజురీయింబర్స్‌మెంట్‌లను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గ్రూప్-I ఉద్యోగాల భర్తీ చేయడానికి తీసుకోచ్చిన జీవో 29ను రద్దు చేయాలన్నారు. ఈ జీవో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయంచేసే విధంగా ఉందన్నారు. పాత జీవో 55 ప్రకారమే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ విద్యాసంస్థలల్లో టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలన్నారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేసి నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. జిల్లాలో అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టల్, గురుకులాలకు నూతన భవనాలను నిర్మించాలన్నారు. కాస్మోటిక్ చార్జీలు, మెస్ చార్జీలు పెంచి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలన్ని తక్షణమే పరిష్కరించాలని కోరారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజికి పూర్తి స్థాయి క్యాంపస్ లేకపోవడంతో ప్రభుత్వ డిగ్రీకళాశాల భవనంలో నడిపిస్తున్నట్లు చెప్పారు. అ భవనం అటు డిగ్రీ కళాశాల విద్యార్థులకు సరిపోవడం లేదన్నారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలోని నర్సింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి నాణ్యమైన భోజనం అందడం లేదని అన్నారు. హాస్టల్, బస్సు మెయింటెనెన్స్‌లను విద్యార్థుల దగ్గర నుంచి వసూళ్లు చేస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం భరించాలన్నారు. జిల్లాలోని మెడికల్ కళాశాలకు పూర్తిస్థాయిలో హాస్టల్, అనుబంధంగా వంద పడుకల అనుపత్రిని నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఈశ్వర్, నిశాంత్, మనీష్, నిరీక్షణ, మిస్బా, అఖిల, సౌజన్య, శ్రావణి, నవ్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభయ హస్తం లబ్ధిదారుల్లో నిరాశ

5వ పేజీ తరువాయి

జిల్లాలో 60881 మంది అభయ హస్తం లబ్ధిదారులు పథకంలో చేరి వాటాధనాన్ని చెల్లించారు. ఐదేళ్లుగా పింఛన్‌కు కూడా నోచుకోవడం లేదు. జిల్లాలో అభయ హస్తం సభ్యులు బోయిన్‌పల్లి మండలంలో 4909 మంది, చందుర్తి 3176, ఇల్లంతకుంట 5497, గంభీరావుపేట 6067, కోనరావుపేట 5860, ముస్తాబాద్ 6439, రుద్రంగి 2104, సిరిసిల్ల మున్సిపల్ 7268 మంది, తంగళ్లపల్లి 3780, వీర్నపల్లి 1520, వేములవాడ మున్సిపల్ 83, వేములవాడ 5532, వేములవాడ రూరల్ 3321, ఎల్లారెడ్డిపేటలో 5325 మంది ఉన్నారు. వీరందరూ రోజుకు ఒక రూపాయి చొప్పున సంవత్సరానికి రూ.365 జమ చేయించారు. జమ చేసిన సభ్యుల్లో 60 సంవత్సరాలు దాటిన వారికి రూ.500 చొప్పున పింఛన్ అందించే వారు. సభ్యురాలికి బీమా సౌకర్యం కల్పించారు. సహజంగా మరణిస్తే రూ.30 వేలు, ప్రమాదంలో చనిపోయిన, శాశ్వత అంగవైకల్యం పొందిన రూ.75 వేలు, పాక్షికంగా దివ్యాంగులైతే రూ.37,500 చెల్లించే విధంగా ఏర్పాట్లు చేశారు. పింఛన్ రావాల్సిన వారికి బకాయిలు రూ.8 కోట్ల వరకు ఉన్నాయి. పింఛన్ బకాయిలతోపాటు ఇన్సూరెన్స్ అందడం లేదు. అభయ హస్తం లబ్ధిదారులు పథకాన్ని పునరుద్ధరించడమో, లేదా వాటధనాన్ని వడ్డీతో సహా చెల్లించడమో చేయాలని కోరుతున్నారు.

● జిల్లాలో లబ్ధిదారుల వాటాధనం రూ.4.82 కోట్లు

జిల్లాలో పథకంలో 60,881 మంది సభ్యులు చేరారు. ప్రతీ సంవత్సరం రూ.365 చప్పున రూ.4.82 కోట్లు వాటాధనం కింద జమ చేశారు. సభ్యుల్లో 60 సంవత్సరాలు దాటిన వారు పింఛన్‌కు అర్హత పొందారు. 2015-2016 వరకు పింఛన్ అర్హత పొందినవారు 3969 మంది ఉన్నారు. పథకంలోని 60 సంవత్సరాల లబ్ధిదారులకు 2015 డిసెంబరు వరకు పింఛన్, సభ్యుల పిల్లలకు ఉపకార వేతనాలు సక్రమంగానే అందాయి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 2017 జనవరిలో మాత్రమే పింఛన్ వచ్చింది. ఇప్పటికి దాదాపు అరేళ్లుగా పింఛన్ రావడంలేదు. ప్రభుత్వం ఈ పథకాన్ని తొలగించినట్లు చెప్పకుండానే వెబ్‌సైట్‌ను మూసివేసింది.

సమగ్ర సర్వేకు సిద్ధం

5వ పేజీ తరువాయి

ఆంధ్రజ్యోతి: కమతాల సర్వేతో ఉపయోగం ఏమిటి?

సీపీవో : కమతాల సర్వే రైతులకు వివిధ పథకాలు రూపొందించడానికి ఉపయోగకరంగా ఉంటుంది. వ్యవసాయంలో వచ్చిన మార్పులు, అంచనాలు వేయడం ద్వారా రైతులకు ప్రయోజనాలు, వసతులు కల్పించడానికి ఉపయోగపడుతుంది.

ఆంధ్రజ్యోతి: వర్షపాతం రికార్డు ఎలా చేస్తారు?

సీపీవో : జిల్లాలో 31 కేంద్రాల ద్వారా వర్షపాతం రికార్డు అవుతుంది. 13 మ్యానువల్ రేయిన్ గేజ్‌లు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతీ రోజు ఉదయం తహసీల్ సిబ్బంది రికార్డు చేస్తారు. 21 ఆటోమేటిక్ రేయిన్‌గేజ్‌లు ఉన్నాయి. వీటిలో వర్షపాతంతోపాటు గాలి వేగం, దిశ, టెంపరేచర్, ఇమ్యూనిటీ లెక్కిస్తాం.

ఆంధ్రజ్యోతి: ప్రణాళిక శాఖలో సరిపడా సిబ్బంది ఉన్నారా?

సీపీవో : జిల్లా ప్రణాళిక శాఖలో సరిపడా సిబ్బంది లేరు. అన్ని విభాగాలకు సంబంధించి పాత జిల్లాల ప్రకారం 19 మంది వరకు ఉండాలి. ప్రస్తుతం నలుగురు పూర్తిస్థాయి ఉద్యోగులు, ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు.

ఆంధ్రజ్యోతి : ప్రణాళిక శాఖలో ఇతర పర్యవేక్షణలు ఏమిటి?

సీపీవో: ప్రణాళిక శాఖ వివిధ విభాగాల గణాంకాలు సేకరిస్తుంది. వ్యవసాయం, పరిశ్రమలు, ధరలు, దిగుబడులు, ఆర్థిక, మౌలిక సదుపాయాలు, విద్య, సంక్షేమం, పరిపాలన, పట్టణ గ్రామీణాభివృద్ధి ప్రణాళికల లెక్కలను సేకరిస్తుంది. దీంతోపాటు ఎమ్మెల్యేలు, ఎ ంపీలు, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు సంబంధించి నిధుల ఖర్చుపై పర్యవేక్షణ, జిల్లాలో ఎస్‌జీఎఫ్, సీడీఎఫ్ నిధుల పర్యవేక్షణ ఉంటుంది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే

గంభీరావుపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ద్వితీయ, తృతీయ చదువుతున్న బిఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థుల ఆదంవర్యంలో ప్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ కళాశాలలో ఉన్న సౌకర్యాలను వినియోగించుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మితో పాటు షీటీం ఏఎస్ఐ ప్రమీల, షీటీం బృందం, అద్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నారు.

కుక్క దాడిలో ముగ్గురికి గాయాలు


కోనరావుపేట, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బుధవారం కుక్క దాడి చేయగా ముగ్గురికి గాయాలయ్యాయి. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన రాహుల్, రవళిపై కుక్క దాడి చేసి గాయపరచగా అక్కడే ఉన్న స్వీపర్ బొల్లె నర్సయ్య విద్యార్థులపై దాడి చేస్తున్న కుక్కను చేదరగొట్టే ప్రయత్నం చేశాడు. అతన్ని కూడా గాయపరిచింది. అక్కడే ఉన్న ఉపాధ్యాయులు కర్రలతో చెదరగొట్టారు. దీంతో గాయపడ్డ ముగ్గురిని చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సెస్ వార్షిక ఆదాయంపై రేపు బహిరంగ విచారణ

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం వార్షిక అదాయంపై ఈ నెల 25న శుక్రవారం విద్యుత్ వినియోగదారులతో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి అధ్వర్యంలో బహిరంగ విచారణ చేపట్టడం జరుగుతుందని ఎండీ శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం యొక్క రిటేయిల్ సరఫరా వ్యాపార ఐదవ నియంత్రణ కాల అర్థికసంవత్సరం 2024- 25 నుంచి 2028- 29 వరకు అలానే అర్థిక సంవత్సరం యొక్క 2024- 25 అదాయ అవశ్యకత, విద్యుత్ ఛార్జీల నుంచి అంచనా అదాయం అమోదం కోసం పట్టణంలోని పద్మనాయక కళ్యాణ మండలంలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బహిరంగ విచారణ ఉంటుందని తెలిపారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఎండీ కోరారు.

మంకీగన్





జిల్లా కేంద్రంలో మంకీగన్ విక్రయాలు

సిరిసిల్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కోతుల బెడద ఎంతో తీవ్రంగా ఉందో మంకీగన్‌ల అమ్మకాలు అద్దం పడుతున్నాయి. ప్రధానంగా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో గూన పెంకల ఇళ్లను ధ్వంసం చేస్తున్నాయి. పండ్లు, కూరగాయల తోటలను కోతులు పాడు చేస్తున్నాయి. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో సైతం గుంపు గుంపులుగా ఇళ్ల మధ్య తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి తినుబండారాలను ఎత్తుకెళ్తున్నాయి. ఈ క్రమంలో మహారాష్ట్రకు చెందిన వ్యక్తులు బుధవారం సిరిసిల్లలోని వివిధ వాడల్లో ప్లాస్టిక్‌తో తయారు చేసిన భారీ శబ్దం వచ్చే మంకీగన్‌లను విక్రయిస్తున్నారు. రూ.150కి ఒకటి చొప్పున అమ్ముతున్న మంకీగన్‌లో పోటాషియం పోసి లైటర్‌ను అమర్చిన బటన్‌ను నొక్కితే భారీ శబ్దం చేస్తుంది. తక్కువ ధర ఉండడంతో ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.